# 13

# చిత్తశుద్ధితో జీవించుట

## (6:1-18)

"శాస్త్రుల నీతి కంటెను పరిసయ్యుల నీతి కంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని" యేసు తన శిష్యులతో చెప్పాడు (5:20). సూటిగా సూచింపబడిన ఆయన పలుకులు కొండమీద ప్రసంగములో ఆయన ప్రస్తావించనై యుండిన విషయములకు ఒక సారాంశమై యుండినవి.

ఆయన చేసిన ప్రసంగములో, అనగా మత్తయి 5:21-48లో, యేసు తన ఉపదేశములను ఆయన ఉపదేశించిన విషయములకును యూదులు సాంప్రదాయములు తెలియజెప్పుచుండిన విషయములకును మధ్య నుండిన ఐదు తారతమ్యములతో కూర్చాడు. 6:1-18లో, అనగా ఆయన ఉపదేశానుసారమైన ఆదేశముల రెండవ భాగములో, ఆయన మత సంబంధమైన రూపములు మరియు హృదయముతో - నిజమైన మతము మరియు దానికి వ్యతిరేకముగానున్న బాహ్య ఆచార కర్మలతో వ్యవహరించాడు.

ఒక సాధారణ హెచ్చరిక చేసిన తదుపరి (6:1), యేసు మూడు పెద్ద ఉదాహరణములను నివేదించాడు: ఇచ్చుట (6:2-4), ప్రార్థించుట (6:5-15), మరియు ఉపవాసము చేయుట (6:16-18). వారి బోధనలలో ప్రతివిధ ఉదాహరణ సందేహములను ఉపయోగించుట, యూదా మత బోధకులకు ఒక సామాన్యమైన సంగతై యుండినదని క్రెయిన్గ్ ఎస్. కీనర్ పేర్కొన్నాడు.[1]

### ఒక సాధారణ హెచ్చరిక (6:1)

**[1]మనుష్యులకు కనబడవలెనని వారి యెదుట మీ నీతికార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోకమందున్న మీ తండ్రి యొద్ద మీరు ఫలము పొందరు.**

**వచనము 1.** ఆయన ఇచ్చుట, ప్రార్థించుట, మరియు ఉపవాసము చేయుట గూర్చి మాటలాడుచు, సార్థకముగా, "నేను చెప్పబోవుచున్న విషయాలను అతి జాగ్రత్తగా ఆలకించుడని" చెప్పాడు. **జాగ్రత్తపడుడి** అను అర్థమిచ్చు గ్రీకు పదము (*prosechō*) "కైవశము చేసికొనుము," "శ్రద్ధ చూపుము," మరియు "అప్రమత్తముగా నుండుము" అను భావములను సూచించినది. వారి **నీతి** కార్యముల యెడల శాస్త్రులు మరియు పరిసయ్యులు కలిగియుండిన అవే వైఖరులను తన శిష్యులు కూడ పెంపొందించుకొనకూడదని యేసు వారిని హెచ్చరించుచుండెను. "నీతి" (*dikaiosunē*) అను పదము 5:20లో నుండి తీసికొనబడి పునరుక్తము గావింపబడినది. Textus Receptusలోని పాఠాంతరము ఆధారంగా, KJVలోని మొదటి వచనంలో "నీతికి" బదులుగా "ధర్మము" అని వ్రాయబడి యున్నది. ఏదిఏమైనా, "నీతి" ఉన్నతమైన వచనమై యున్నది, గనుక 6:2-4లో చర్చించబడిన ఇచ్చుటయను అంశము గూర్చి ఒక క్లుప్త ఉపోద్ఘాతము నిచ్చుట కంటె,

దానికి బదులుగా 6:2–18కి 6:1 ఒక సాధారణ పరిచయమై యున్నది.

నిజమైన నీతి, చిత్తశుద్ధిగల ఒక హృదయములో నుండి తొలగింపబడిన మతసంబంధమైన కార్యకలాపములు నిర్వహించుట ద్వారా ప్రదర్శింపబడు నిరర్థకమును, బాహ్యముగా ఆడంబరమునై యున్న విషయమునకు దూరముగా నిలిచియుండును. **మనుష్యులు గుర్తించునట్లు,** క్రియలు **వారి యెదుట** చేయబడకూడదు. దానికి బదులుగా, భయభక్తులు గల హృదయముతో అవి దేవుని గౌరవించుటకు ఆయనను మహిమపర్చుటకును చేయబడవలెను. “నీతివంతమైన” క్రియలు దేవుడు మరియు తోటి మానవుల యెడల ప్రేమనుబట్టి చేయబడనట్లయితే, అవి నిరర్థకమైనవే (1 కొరింథీయులకు 13:1–3). మతమునకు సంబంధించిన చర్యలను తప్పుడు ప్రోత్సాహకముతో చేపట్టువారికి **తండ్రి** ఎటువంటి **ప్రతిఫలమునైనను ఇవ్వడని** తెలిసికొందురు. “ప్రతిఫలము” (*misthos*) అను పదము, మనము ఇచ్చినదానికి (6:2), చేయు ప్రార్థనకు (6:5), మరియు చేయు ఉపవాసమునకు (6:16). దేవుడు ప్రదర్శించు ప్రతిస్పందనకు సంబంధించు ఒక సందర్భ సహితమైన వ్యాఖ్యాగా ప్రతి అంశము యొక్క ఆరంభములో పునరుక్తమగుచున్నది.

## ఇచ్చుట (6:2–4)

**2కావున నీవు ధర్మము చేయునప్పుడు, మనుష్యులవలన ఘనత నొందవలెనని, వేషధారులు సమాజమందిరములలోను వీధులలోను చేయులాగున నీ ముందర బూర ఊదింపవద్దు; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. 3నీవైతే ధర్మము చేయునప్పుడు, నీ ధర్మము రహస్యముగానుండు నిమిత్తము నీ కుడిచెయ్యి చేయునది నీ యెడమచేతికి తెలియకయుండవలెను. 4అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును.**

**వచనము 2**. అల్పమైన అర్థము గల క్రియా విశేషణము లేక విభక్తి ప్రత్యయమైన గ్రీకు *hotan* నీతివంతమైన క్రియలతో వ్యవహరించు ప్రతి విభాగము యొక్క ప్రారంభమునకు ఒక గుర్తుగా పనికివచ్చుచున్నది, మరియు **అప్పుడు** లేక “... అప్పుడెల్లా” అని అనువదింపబడినది (6:2, 5, 16). ఆయన బోధలు వినుచుండిన శ్రోతలు అది వరకే ఇచ్చుట, ప్రార్థించుట, మరియు ఉపవాసము చేయుట వంటి పరోపకారిత కార్యకలాపములలో నిమగ్నమై యుండిరని యేసు భావించాడు. యూదా ప్రజల నుండి ఇటువంటి కార్యకలాపములు ఆశింపబడినవి.

**బీదలకు ఇమ్ము** అని అనువదింపబడిన పదము *eleēmosunē*, సర్వసామాన్యముగా కనికరము లేదా జాలి గల ఏ కార్యమునైనను చేయుటను సూచింపవచ్చును. అది కేవలము సహానుభూతితో కూడిన అనుభూతులను మాత్రమే కాదు, కానీ ఇబ్బందులలో ఉన్నవారికి ఉపశమనము కలిగించుటకు చేపట్టబడు యథార్థమైన కార్యములను కూడ తెలియజేయుచున్నది. యాకోబు చెప్పుచున్నదాని ప్రకారము, అవసరములో నున్న వారి యెడల అనురాగ సహితమైన అనుభూతులు కలిగియుండుట మాత్రమే చాలదు. ఒక క్రైస్తవుడు ప్రేమతో కూడిన తన చర్యల ద్వారా ఇబ్బందులలో నున్న వారి సమస్య తీవ్రతను తగ్గించుటకు వెదకుచుండును (యాకోబు 2:14–16).

ప్రస్తుత సందర్భములో, *eleēmosunē* అను పదము యూదులు **బీదలకు ధర్మము** చేయుచుండిన వాడుకను ఎక్కువ నిర్దిష్టముగా సూచించుచున్నది. (KJV; NRSV) ఈ పదమును క్రొత్త నిబంధనలోని యితర వాక్యభాగములలో సాధారణంగా "ధర్మము" అని KJV మరియు NRSV అనువదించుచున్నవి (లూకా 11:41; 12:33; అపొస్తలుల కార్యములు 3:2; 9:36; 10:2; 24:17). మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "పొట్ట కూటి కొరకు వ్యవసాయమునే నమ్ముకొని యుండిన ప్రాచీన సమాజములలో పేదరికము విస్తరముగా విస్తరించి యుండినది, గనుక ఇశ్రాయేలు ప్రజలు బీదల అవసరములకు సమకూర్చవలసిన అనివార్య కర్తవ్యమును తీవ్రముగా పరిగణించారు (ద్వితీయోపదేశకాండము 15:11తో పోల్చి చూడు)."[2]

**మనుష్యుల చేత గౌరవింపబడవలెనను** ఉద్దేశముతో బీదల కిచ్చుటను ప్రభువు ఖండించుచుండెను. ఎవరైనాగాని ఉదారత చేత రక్షణను కొనుగోలు చేయవచ్చునని అనేక మంది యూదులు నమ్మునంతగా యూదా మత బోధకుడు ఉదారత యొక్క సరైన ఉద్దేశమును దారి తప్పించారు. "ఏలయనగా ధర్మము చేయుట మరణము నుండి రక్షించి, ప్రతి పాపమును కడిగివేయునని"[3] టోబిత్ పుస్తకము, అప్రామాణిక గ్రంథములలో ఒకటి చెప్పుచున్నది.

ఇచ్చుటలో వారు వేషదారులై యుండకూడదని యేసు తన శిష్యులను హెచ్చరించాడు. **సమాజమందిరములలోను వీధులలోను వారి ముందర బూర ఊదింపబడవలెనని** శాస్త్రులు మరియు పరిసయ్యులు ఆశించారని కూడ ఆయన సెలవిచ్చాడు. వారు చేయుచున్న కార్యమును సమాజము గౌరవించువారి చేత గమనింపబడాలని ధనవంతులైన పరిసయ్యులు ధర్మము చేయుచుండినప్పుడు వాస్తవముగా వారి ముందర ఒక బూర ఊదించారని ఈ వ్యాఖ్యానమును మనము ఒక అక్షరార్థ వాంగ్మూలముగా ఎంచవలెనా? కొందరు ఇది వాస్తవమే అని ఎంచుదురు. ఏదిఏమైనా, దేవాలయములో ధర్మములు పోగుచేయబడిన సమయంలో బూరలు ఊదబడినవని ఇతరులు సూచించారు. విరాళములను పోగుచేయుటకు ఏర్పాటు చేయబడిన పదమూడు *shofar* పెట్టెలే (*shopar,* అనగా హెబ్రీ భాషలో "కొమ్ము" అని అర్థము) బూర (పొట్టేలు కొమ్ములు) ఆకారములో ఉండినవి.[4] పెట్టెలలో చేయబడుచుండిన విరాళములను (డబ్బును) దొంగలు దొంగిలించుటకు చేయు ప్రయత్నములో వారి చేతులు ఆ పెట్టెలలోనికి నాణెములు వేయబడినప్పుడు అవి ఈ పెట్టెల మీదుగా జారి క్రింద పడును, ఆ సమయంలో అవి చేయు శబ్దము ప్రజల సావధానమును ఆకర్షించుచుండినది. సరికదా, నాణెములు చేయుచుండిన శబ్దము కొంత మేరకు ఎవరు, ఎంత పెద్ద మొత్తములో వేయుచుండిరో కూడ తెలుపుచుండినది (లూకా 21:1, 2 చూడు)

వారు ధర్మము చేయుచుండినప్పుడు ఎవరైనాగాని *వ్యక్తగతముగా* బూర ఊదించారని మనకు బైబిలేతర నిదర్శనము లేదు. మన ప్రభువైన యేసు క్రీస్తు వర్ణించుచుండిన చిత్రీకరణము ప్రజల సావదానము ధర్మము చేయుచుండినవారి వైపునకు మళ్లింపబడుచుండిన తీరును వర్ణించుటకు బహుశా ఒక రూపకాలంకారమును మించినదై యుండదు. జాక్. పి. లూయిస్ తన తుది అభిప్రాయమును చెప్పినట్లుగా, అది "'నీ సొంత డబ్బాను వాయించుటతో' పోల్చబడదగిన రూపకాలంకార అభివ్యక్తమై యుండును."[5] ఈ అభివ్యక్తము "వర్షముల కొరకు చేయబడిన వసంతకాల బహిరంగ ఉపవాస

సమయములలో పొట్టేళ్ల కొమ్ములు ఊదబడినప్పుడు ధర్మములు చేయబడినవను వాస్తవము నుండి తీసికొనబడియుండవచ్చునని" ఆయన అనుకున్నాడు."[6]

ఇతరుల దృష్టినాకర్షించుటకే వారి ఉదార విరాళముల నిచ్చినవారిని యేసు **వేషదారులని** సూచించాడు. "వేషదారి" అను పదము, దాని ప్రాథమిక అర్థములో, ఒక "నాటక నటుడిని" సూచించిన *hupokritēs* అను గ్రీకు పదమునకు లిప్యంతరీకరణము చేయబడినదై యున్నది. నాటక ప్రదర్శనశాల గూర్చి యేసు ఎరిగియుండెను. యేసు *Sepphoris*తో, నజరేతుకు కొద్ది దూరములోనే ఉండిన అన్యజనుల పట్టణముతో, కచ్చితంగా సుపరిచితుడై యుండెను. ఏదిఏమైనా, ఈ కాలమునకు ముందు *hupokritēs* అను పదము, లేనిది ఉన్నట్టుగా నటించుచుండినవారి గూర్చి చెప్పుకొనుటకు అదివరకే యూదా ప్రజల వాడకములో ఉండినది.[7] "(వీరు) వారి సొంత అంతరంగిక అవినీతి, వారికే తెలియకుండునట్లు ముసుగు కప్పిన, నీతివంతమగు బాహ్య చర్యలు కొనసాగించుచుండిరి. వారి వేషధారణ, ముఖ్యంగా ఈ సందర్భములో, *సరైన పనులను తప్పుడు హేతువులతో* చేయుటకై యుండినది."[8] "వేషధారులు" అను పదము మత్తయి వ్రాసిన సువార్తలోని నీతికి సంబంధించిన ప్రతి విభాగము యొక్క ప్రారంభములో కనిపించుచున్నది (6:2, 5, 16), మరియు ఇతర సందర్భములలో కూడ కనిపించుచున్నది (7:5; 15:7; 22:18; 23:13, 15, 23, 25, 27, 29; 24:51).

వారు ప్రజల చేత గుర్తింపు పొందవలెనని మాత్రమే ధర్మము చేసినట్లయితే, **వారి పూర్తి ప్రతిఫలము వారికియ్యబడునని** యేసు సెలవిచ్చాడు. "వారు తమ పూర్తి ఫలము పొందియున్నారు" – ఈ వాక్యము *apechō* నుండి ఉత్పన్నమగుచున్న ఒక గ్రీకు పదమును అనువదించుచున్నది. "చెల్లింపబడవలసిన మొత్తమంతా చెల్లింపబడినది" (ఫిలిప్పీయులకు 4:18 చూడు; NRSV) అని అర్థమిచ్చునట్లు ఇది ప్రాచీన ప్రపంచంలో ఒక రసీదు యొక్క క్రింది భాగములో ప్రయోగింపబడుచు, అకౌంటింగ్‌కు సంబంధించిన పదమై యుండినది.[9] వేషధారుల చేత పొందబడిన మానవ గుర్తింపు, వారికి అది మాత్రమే వారి ప్రతిఫలమై యుండునని యేసు ప్రభువు సెలవిచ్చాడు. పరలోకమందున్న తండ్రి నుండి దేనినైనను పొందుటకు వారు ఆశించకూడదు.

**వచనము 3.** ఈ విషయమును మరి ఎక్కువ ఉద్ఘాటించి తెలియజెప్పుటకు యేసు, **నీవు బీదలకు ధర్మము చేయునప్పుడు, నీ కుడి చేయి చేయుచున్నది నీ ఎడమ చేతికి తెలియకుండవలెను** అని చెప్పాడు. ఈ ఉద్బోధ సర్వసాధారణంగా, ఇచ్చుట సాధ్యమైనంత విచక్షణతోను జాగ్రత్తగాను చేయబడవలెనని ఒక నానుడి తీరులో చెప్పుకొనుట యని అర్థంచేసికొనబడుచున్నది. ఈ విచక్షణను నొక్కివాక్కాణించుచునే, రాబర్ట్ హెచ్. గుండ్రి ఒక భిన్నమైన దృక్పథమును వెలిబుచ్చుచున్నాడు: "బహుశా ఈ వ్యక్తీకరణము అక్షరార్థముగా అర్థంచేసికొనబడవలెను: ప్రతిఫలము దానిని పొందువానికి, దగ్గరలో ఉన్న వారి సావదానమును ఆకర్షించుటకు ఏర్పాటుచేయబడినట్లు రెండు చేతులతో గాక, నిరాడంబరముగా కుడి చేతితో మాత్రమే అందజేయవలెను."[10]

**వచనము 4.** మేలు చేయవలెననియు దేవుని సంతోషపర్చవలెననియు నిజాయితీతో ఇచ్చువాడు ఈ పనిని **రహస్యముగానే** చేయును, గనుక దేవుడు వాడు చేసిన కార్యమునుబట్టి వానిని దీవించును. "రహస్యముగా" అనగా, వేషధారులు చేసినట్లుగా

ఇతరుల సావధానమును ఆకర్షించు ప్రయత్నము చేయకుండా చేయుట యని అర్థము. రహస్యముగా **ఇచ్చుట** గూర్చి యేసు చేసిన ఉపదేశము యూదా మతమునకు అపరిచితమైన అన్య విషయమేమీ కాదు. మిష్నా బోధ ప్రకారము, వినమ్రుడైన ఒక యూదుడు, తన గూర్చి దృష్టిని ఆకర్షించుకొనకుండా రహస్యముగా ధర్మము చేయగలుగునట్లు నుండును.[11] టాల్ముడ్ ఉపదేశమేమనగా, "రహస్యముగా ధర్మము చేయువాడు మన బోధకుడైన మోషే కంటే గొప్పవాడు."[12] "ధర్మము చేయువాడు, అతడు ఎవరికిచ్చుచున్నాడో మరియు, ధర్మము పొందువాడు, అతడు ఎవరి నుండి పొందుచున్నాడో తెలిసికొనవలసిన అవసరం లేదని" కూడా టాల్ముడ్ సెలవిచ్చుచున్నది."[13]

ఏదిఏమైనా, ఇవ్వబడునదంతయును రహస్యముగానే ఇవ్వబడవలెనని యేసు భావించలేదు. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి, పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడని" ఆయన అదివరకే సెలవిచ్చాడు (మత్తయి 5:16). వారిని ఇతరులు పొగడవలెనను ఉద్దేశముతో మంచి పనులు చేయకూడదనునది ఆయన బోధయై యున్నది. మనుష్యుల గుర్తింపును కోరుకొనకుండా ఈ పనులు చేయవలెను; అప్పుడు ఇతరులు దానిని గమనించినట్లయితే, దేవుడు మహిమరచబడును. యేసు, మేలు చేయుట గూర్చిన ప్రాచుర్యమును ఖండించుట లేదు, కానీ ప్రాచుర్యము కొరకే మంచి చేయవలెనను ప్రేరణను ఆయన ఖండించుచుండెను.

ప్రజల చేత ప్రత్యేకముగా పొగడబడవలెనని ధర్మము చేయబడకూడదు, కానీ దేవుడిచ్చు ప్రతిఫలము కొరకే చేయబడవలెను: **రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును.** దేవుడు, తన ప్రజలు చేయుచుండు ధర్మ కార్యములన్నిటిని తన సర్వజ్ఞతనుబట్టి, "చూచును" గనుక ఆయన సముచితమైన "ప్రతిఫలము" సమకూర్చును.

## ప్రార్థించుట (6:5–15)

### వేషధారుల వలె కాదు (6:5–8)

**[5]మరియు మీరు ప్రార్థనచేయునప్పుడు వేషధారులవలె ఉండవద్దు; మనుష్యులకు కనబడవలెనని సమాజమందిరములలోను వీధుల మూలలలోను నిలిచి ప్రార్థనచేయుట వారికిష్టము; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. [6]నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము; అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును. [7]మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు; విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు; మీరు వారివలె ఉండకుడి. [8]మీరు మీ తండ్రిని అడుగక మునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియును.**

అటుతరువాత యేసు ప్రార్థన గూర్చి ఉపదేశించాడు, ప్రార్థన చేయుటకు సరైనది మరియు తప్పుడు విధానము ఏమిటో బోధించాడు. ప్రార్థన చేయుట సరైనదే, కానీ "వేషధారులు" చేయుచుండు రీతిలో చేయుట తప్పు. ఇచ్చట మనము బహిరంగ ఆరాధన

గూర్చి ఒక సామాన్య గద్దింపును గమనించకూడదు. మనము చేయు ప్రార్థనలు ఇతరుల యెదుట డంబముగా ప్రదర్శింపబడవలెనను శోధనకు లొంగకూడదని మాత్రమే యేసు హెచ్చరించుచుండెను.[14]

**వచనము 5. మీరు ప్రార్థన చేయునప్పుడు** అని పలుకుచూ యేసు తన బోధను మొదలుపెట్టాడు. ప్రతి రోజు ఏర్పాటు చేయబడిన సమయముల ప్రకారము ప్రార్థించుటకు అలవాటుపడిన యూదుల నుద్దేశించి ఆయన ఉపదేశించుచుండెను. ఉదయ కాలము మరియు సాయంకాలము అర్పింపబడుచుండిన బల్యర్పణలతో పాటుగా, మూడవ జామున (ఉదయం తొమ్మిది గంటలకు) మరియు తొమ్మిదవ జామున (సాయంకాలము మూడు గంటలకు) (ఎజ్రా 9:5; దానియేలు 9:21; లూకా 1:10; అపొస్తలుల కార్యములు 3:1) ప్రార్థనలు చేయబడుచుండెను.[15] ఆరవ జామున, అనగా, మధ్యాహ్నము (అపొస్తలుల కార్యములు 10:9) కూడ ప్రార్థనలు చేయబడుచుండెను. కాబట్టి, ప్రతి దినము ముమ్మారు ప్రార్థన చేయుట అదొక వాడుకయై యుండినది (కీర్తనలు 55:17; దానియేలు 6:10). ఈ అలవాటును కొందరు ఆది క్రైస్తవులు కొనసాగించారు.[16]

వారు **వేషధారుల వలె ఉండకూడదని** యేసు తన శిష్యులకు చెప్పాడు. "వేషధారులు" అనగా ఎవరో మత్తయి 23లో ఆయన వారికొక నిర్వచనము నిచ్చాడు: "శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు; గనుక వారు మీతో చెప్పువాటి నన్నిటిని, అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియల చొప్పున చేయకుడి; వారు చెప్పుదురే గాని చేయరు" (23:2, 3). "వారు ప్రబోధించు విషయాలను వారు పాటించరు" అని NIVలో వ్రాయబడి యున్నది. అటుతరువాత యేసు, యూదా తమ నాయకులు వారే స్వయంగా "తమ వ్రేలితోనైన వాటిని కదిలించుటకు" ఇష్టపడని భారమైన బరువులు మోపుదురు అని చెప్పాడు (23:4). వేషధారణతో కూడిన వారి ఉద్దేశమును గూర్చి కూడ యేసు తెలియజెప్పాడు: "మనుష్యులకు కనబడు నిమిత్తము తమ పనులన్నియు చేయుదురు" (23:5).

యూదులు ప్రార్థించునప్పుడు ప్రదర్శింపబడుచుండిన వేషధారణ ఇంత కంటే ఎక్కువ స్పష్టంగా ఇంకెక్కడైనను గమనింపబడలేదు, వేషధారులు, **మనుష్యులకు కనబడవలెనని సమాజమందిరములలోను వీధుల మూలలలోను నిలిచి ప్రార్థన చేయుటకు ఇష్టపడుదురని** యేసు చెప్పాడు. యూదులు తరచుగా నిలువబడి కన్నులెత్తి, ఆకాశము వైపు చేతులు చాచి ప్రార్థించుచుండిరి (1 రాజులు 8:22; కీర్తనలు 28:2; 63:4; 134:2; లూకా 18:11, 13). రాబర్ట్ హెచ్. మౌన్స్ చెప్పుచున్న దాని ప్రకారము, ఒకడు ఏర్పాటు చేయబడిన ప్రార్థన సమయానికి వీధిలో ఉన్నట్లయితే, "అచ్చటనే ఆగిపోయి, దేవాలయము వైపు తిరిగి, ప్రార్థన చేయుట సరైన విషయమై యుండినది."[17] బహుశా ప్రార్థన చేయుటకు సమయమయ్యిందంటే వేషధారులు అందరికీ కనబడునట్లు ఉండుటకు వీలయ్యే చోటును ఏదో ఒక విధంగా ఎంపిక చేసుకొనుటకు ఒక మార్గమును వెదకుచుందురు.

బహిరంగముగా ప్రార్థన చేయుట అంటే వీరికి ఎంత ఇష్టమో! ఏలయనగా వారు ఆధ్యాత్మికతతో కూడిన మనస్సుగలవారిని, అది వారి పేరుప్రతిష్ఠలను పెంపొందింపజేసికొనుటకు బహుగా ఉపయోగపడినది. వారు మాత్రమే "దైవభక్తి గలవారని" ఇతరులు తెలిసికొనవలెనని వారాశించుచుండిరి. వారు ప్రజలందరి సావధానమును

వెదకుచు చెడు విషయాల్లో పేరు ప్రఖ్యాతలు తెచ్చు పరిస్థితులలోఉండవలెనని ఎంతో ప్రయాసపడుచుండిరి (లూకా 18:9–14). ఇటువంటి **వారు వారి ప్రతిఫలము పొందుదురని** యేసు చెప్పాడు. వారు ప్రతిఫలముగా పొందగలది మనుష్యుల పొగడ్తలు మాత్రమే (6:2పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 6**. దీనికి తారతమ్యముగా, వారు **రహస్యముగా** దేవుని యెదుట వినయముతో **ప్రార్థన** చేయవలెనని చెప్పుచూ యేసు తన శిష్యులకు ఒక చక్కని మార్గనిర్దేశనము నిచ్చాడు. **లోపలి గది** (*tameion*), ఒకరి ఇంటి లోపలి సామానులను భద్రపరచుటకు ఏర్పాటు చేయబడిన గదిని సూచించినది. తరచుగా వారు తమ ఇళ్లను మట్టి ఇటుకలతో కట్టుకొనుచుండిరి, గనుక దొంగలు మట్టి గోడలకు కన్నము వేసి (6:19) లోనికి ప్రవేశించి ఇల్లును దోచుకొనగలుగుచుండిరి. కాబట్టి, తాళము వేసికొనుటకు వీలుండు **తలుపుగల** ఒక గదిని ఇంటి లోపల ఏర్పాటు చేసికొనుట ఎంతో ముఖ్యమైన అంశమై యుండినది.[18] హృదయాంతరంగములో నుండి రహస్యముగా ప్రార్థన చేయువారు **రహస్యముగా చేయబడు** ప్రతి విషయమును చూచుచుండు వారి **తండ్రి** నుండి **ప్రతిఫలము** పొందుదురు.

సమాజమందిరములలో లేదా దేవాలయములో నిర్వహించబడుచుండిన ఆరాధన సమయంలో చేయబడు బహిరంగ ప్రార్థనను యేసు నిషేధించలేదు, కానీ దాని కంటె ఎక్కువగా ఆయన ప్రార్థనను ఒక ఆడంబరమైన అంశముగా చేయుట గూర్చి వారిని గద్దించుచుండెను. యేసు రహస్యముగా ప్రార్థించాడు మరియు బహిరంగముగా కూడ ప్రార్థించాడు, గనుకనే వారు ఎలా ప్రార్థన చేయాలో ఆయన తన శిష్యులకు బహిరంగముగా ఉపదేశించాడు (6:9–13).

**వచనము 7.** వారు ప్రార్థనలు చేయుచుండినప్పుడు *అందరి దృష్టి వారి మీదనే* ఉండాలని మాత్రమే కాదు, కానీ వారు చేయుచుండిన ప్రార్థనల (వారి స్వరము) *శబ్దము అందరికీ వినబడాలని* కూడ వేషధారులు ఆశించారని యేసు అంతఃస్సూచన నిచ్చాడు. వారు **అర్థరహితమైన పునరుక్తములను అనేక మాటలతో** ప్రయోగించారు. యేసు దీర్ఘ ప్రార్థనలను ఖండించలేదు. కనీసము ఒక్కసారైనా, ఆయన తానే ఒక రాత్రంతటిని ప్రార్థన చేయుటలో గడిపాడు (లూకా 6:12). ఒకరు ప్రార్థన చేయునప్పుడు ప్రదర్శించు తన వైఖరి గూర్చి ఆయన ఆందోళన చెందుచుండినంతగా అతడు చేయుచుండిన దీర్ఘప్రార్థనల గూర్చి ఆయన ఆందోళన చెందలేదు, వాగ్ధాటిని లేదా పాండిత్యమును ప్రదర్శించుటకు ప్రార్థన చేయకూడదు.

ప్రార్థనలను వారు పునరుక్తము చేయకూడదని యేసు తన శిష్యులను నిషేధించలేదు. గెత్సేమనే తోటలో, ఆయన అప్పగింపబడిన ఆనాటి రాత్రి, ఆయన అదే ప్రార్థనను అనివార్యముగా ముమ్మారు ప్రార్థించాడు (మత్తయి 26:36–46). పునరుక్తమును ఖండించుటకు బదులుగా, ఆయన "అర్థరహితమైన పునరుక్తములను" (*battalogeō*) అనగా, "వ్యర్థమైన మరియు నిష్ప్రయోజనకరమైన వాగుడు" ప్రయోగింపబడుటను గద్దించుచుండెను. ఆయన పలుకుచుండిన పలుకులను యేసు పునరుక్తము గావించినప్పటికిని, ఆయన తన ప్రార్థనలో వ్యక్తిగతమైనవాడును చిత్తశుద్ధిగలవాడునై యుండెను. దేవుడు వారి ప్రార్థనను ఆలకించునట్లు, వారి నోటి మాటలతో వారు దేవుని మనస్సులో చెరగని ముద్రవేయవలసినవారై యున్నారని వారనుకొనకూడదని యేసు తన

శిష్యులను హెచ్చరించాడు. మొదటి శతాబ్దములో, ప్రార్థన ఎంత దీర్ఘమైనదై యుంటే అంత మంచిది, ఏలయనగా దేవుడు దీర్ఘ ప్రార్థనలను ఆలకించి ప్రత్యుత్తరమిచ్చుటకు అనుకూలముగా నుండునని కొందరు యూదా మత బోధకులు ఉపదేశించారు.[19]

**విస్తరించి మాటలాడుట వలన** వారి ప్రార్థనలను దేవుడు వినునని **అన్యజనులు** నమ్మారని యేసు చెప్పాడు. మతేతర మతములు సరైన కర్మకాండను తరుచుగా నొక్కివక్కాణించినవి, కానీ హృదయ వైఖరిని అలక్ష్యము చేసినవి. వారి కచ్చితత్వమునకు గల ఉదాహరణము *Keener*లో కలదు: "రోమా ప్రభుత్వ న్యాయవాదులు, సరిగ్గా తరతరాల సాంప్రదాయము ద్వారా వారికందింపబడిన ప్రార్థనలు చదివారు; 'ఒక్క అక్షరము/పొల్లు లేదా ఒక కృతువుకు సంబంధించిన ముఖకవళిక తప్పుగా ప్రదర్శింపబడినట్లయితే, చేయబడిన ప్రార్థన అంతా న్యాయసమ్మతమైనది కానిదగును."[20] ప్రార్థన, దేవతలను చాకచక్యంగా తమ ప్రయోజనములను నెరవేర్చువారిగా మల్చుకొనుటకు అనువైన ఒక సాధనమని తరుచుగా దృష్టించబడినది. అన్యజనులు "అంతములేకుండా అదే పనిగా పునరుక్తము చేసినట్లయితే వారు ఏదో ఒక విధంగా నిజమైన దేవుని పేరును ఆమంత్రణము చేయగలిగి, వారు కోరిన దానిని పొందగలరను నిరీక్షణతో దైవికమైన పేర్లుగల సుదీర్ఘ జాబితాలను అభివృద్ధి చేసుకొన్నారని" మౌన్స్ చెప్పుచున్నాడు.[21] మతేతర కృతువులలోని పునరుక్తము పాత నిబంధనలోను మరియు క్రొత్త నిబంధనలోను కనబడును: "వారు (బయలు ప్రవక్తలు) … ఉదయము మొదలుకొని మధ్యాహ్నము వరకు, 'బయలా, మా ప్రార్థన వినుమని' బయలు పేరునుబట్టి ప్రార్థనచేసిరి. (1 రాజుల 18:26), మరియు ఎఫెస్సులోని నాటకశాలలో జమకూడిన జనసమూహము రెండు గంటల సేపు, 'ఎఫెసీయుల అర్తెమి దేవి మహాదేవి' అని కేకలు వేసారు (అపొస్తలుల కార్యములు 19:34).[22]

**వచనము 8.** ఆయన అనుచరులు **వారి వలె ఉండవలెనని** యేసు ఆశించలేదు – అనగా, అన్యజనుల వలె (మరియు వేషధారుల వలె). ఎంత్తయినా, వారు ప్రార్థనలో ఆయనను అడుగక మునుపే ఆయన పిల్లలకు **అవసరమై** యున్న విషయములను **తండ్రియైన** దేవుడు అదివరకే **ఎరిగియున్నాడు**. దేవునికి ఏదో సమాచారము అందించాలి లేదా మన స్వప్రయోజనాల నిమిత్తము మన చాకచక్యముతో దేవుని మన వైపునకు మళ్లించుట, ప్రార్థించుటలో గల ఉద్దేశము కాదు.[23] ఆయన పిల్లలు ఆయనను భయభక్తులతో, కృతజ్ఞతతో సమీపంపవలెను. ప్రార్థనలో, సమస్త మంచి ఈవులకు దాత ఆయనే అని ఒకడు దేవునిపై తానెంతగానో ఆధారపడుచున్నాడను సత్యమును ప్రదర్శించును (7:7–11; యాకోబు 1:17 చూడు).

### మాదిరి ప్రార్థన (6:9–13)

**9–10 కాబట్టి మీరీలాగు ప్రార్థనచేయుడి, –పరలోకమందున్న మాతండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక, 11 మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. 12 మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. 13 మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము.**

ప్రార్థన చేయు విధానము వారి విద్యార్థులకు ఉపదేశించుట యూదా మత బోధకులకు సామాన్యమై యుండినది. గనుక యేసు శిష్యులు ఆయనకు మనవిచేసారు, "ప్రభువా, యోహాను తన శిష్యులకు నేర్పినట్టుగా మాకును ప్రార్థనచేయ నేర్పుము" (లూకా 11:1). యేసు ఉపన్యాసములోని ఈ భాగములో, దేవుని ప్రార్థించుటలో గల మౌలిక అంశములను ఆయన తన శిష్యులకు నేర్పించాడు.

యేసు వారికి నేర్పిన ప్రార్థన (లూకా 11:2–4 చూడు) తరుచుగా "ప్రభువు ప్రార్థన" అని పిలువబడుచున్నది. దీనినే మనము "శిష్యుల ప్రార్థన" యని సంబోధించినట్లయితే అది యింకా ఎంతో ఎక్కువ సముచితమై యుండునుకదా! ప్రార్థనను ఆయన వారి ప్రయోజనము కొరకు నేర్పించాడు గనుక అది ప్రభువు యొక్క వ్యక్తిగత ప్రార్థనలలో ఒకటి కాదు (మత్తయి 26:36–46; యోహాను 17:1–26 చూడు). యేసు దానిని ఒక ప్రాథమికమైన సంక్షిప్త వర్ణనగా ఇచ్చినందునుబట్టి, అది "మాదిరి ప్రార్థన" యని సరిగ్గానే ప్రస్తావింపబడుచున్నది. ఈ నమూనా ప్రార్థన సంక్షిప్తముగాను మరియు సామాన్యమైనదిగాను ఉన్నది, అట్లయినప్పటికిని అది ఎంతో గంభీరమైనదై యున్నది.

**వచనము 9. పరలోకమందున్న మా తండ్రీ** అని దేవుని సంబోధించుటతో యేసు ఈ ప్రార్థనను ప్రారంభించాడు. "నా తండ్రీ" అని ఆయన సంబోధింపగలిగియుండినప్పటికిని, ఆయన అలా పలుకలేదు. ఆయన "మా తండ్రీ." అని పలికాడు. యేసు ఒక అసమానమైన రీతిలో దేవుని కుమారుడై యున్నాడు (యోహాను 3:16), కానీ ఆయన శిష్యులు దేవుని యొక్క ఆధ్యాత్మిక పిల్లలై యున్నారు (యోహాను 1:11–13). వారు కూడ ఆయన కలిగియుండిన అదే విధమైన సన్నిహిత సంబంధముతో దేవుని సమీపింపవలెనని ఆయన తన అనుచరులకు ఆదేశించుట గణనీయమైన అంశమై యున్నది. దేవుడు వారి హృదయములలోనికి తన కుమారుని **ఆత్మను** పంపించాడు గనుక వారు "అబ్బా! తండ్రీ! అని మొఱ్ఱపెట్టుచున్నారని" పౌలు రోమా పట్టణంలో ఉండిన సహోదరులకు సెలవిచ్చాడు (రోమీయులకు 8:15). "అబ్బా" అను మాట ఒక చిన్న బిడ్డ తన తండ్రిని సంబోధించునప్పుడు ఆ బిడ్డ చేత వాడబడిన ఒక అరమెయిక్ పదమైయున్నది. ఈ పదము "నాన్న" కంటే తక్కువ పరిచితమైనదై యున్నది కానీ "తండ్రి" కంటె ఎక్కువ సన్నిహితమైనదై యున్నది.

దేవునిని తండ్రి యని భావించగల విశాల భావము, అదొక ప్రాముఖ్యమైన ఇతివృత్తము కాకపోయినప్పటికిని, అది పాత నిబంధనలో కనబడుచున్నది (నిర్గమకాండము 4:22; ద్వితీయోపదేశకాండము 8:5; 14:1; 32:6; కీర్తనలు 2:7; 103:13; యెషయా 63:16; 64:8; యిర్మీయా 3:4, 19; హోషయా 11:1–4; మలాకీ 2:10). ఆసక్తికరముగా, ప్రార్థన చేయునప్పుడు దేవునిని 'తండ్రీ!' యని సంబోధించుటకు సంబంధించిన కొన్ని ఉదాహరణములు రెండు నిబంధనల మధ్య కాలము నాటి యూదా తమ సాహిత్యములో కనిపించుచున్నవి.[24] ఏదిఏమైనా, దేవుడు తండ్రి యను అభిప్రాయమును యేసు తన పరిచర్య కాలమందంతటను లోకప్రియం చేసాడు.

దేవుని **నామము** పరిశుద్ధపరచబడవలెనని యేసు సెలవిచ్చాడు. "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినదని" కీర్తనాకారుడు రచించాడు (కీర్తనలు 111:9). KJVలో, "*Holy and reverend is his name*" అని అనువదింపబడి యున్నది. "*Reverend*" అను

మాట దేవుని నామము కాదు, సరికదా అది దేవుని బిరుదు సహితము కాదు; అది దేవుని నామము యొక్క అర్థాన్ని విశేషణవంతము చేయుచు దానిని విశదీకరించుచున్నది. ఆయన నామము పూజింపదగినది, గౌరవింపదగినది, మరియు మర్యాద ఇవ్వబడవలసినదై యున్నది (నిర్గమకాండము 20:7 చూడు).

"పరిశుద్ధపరచబడుట," *hagiazō* అను పదమునకు అమలుతో లేని ఒక ప్రాచీన అనువాదమై యున్నది, "పరిశుద్ధ పరుచుము" అనునది దాని అర్థమై యున్నది. దేవుని నామమును యథార్థముగా పరిశుద్ధపరచుట అనగా, ఆయనను గౌరవించుట, మహిమపరచుట, మరియు ఆయనకు లోబడుటయై యున్నది (5:16; 7:21; 1 కొరింథీయులకు 10:31). "పరిశుద్ధుడు," "పవిత్రము చేయుము," మరియు "పవిత్రీకరణము" మొదలగునవి "పరిశుద్ధపరచబడుట" అను పదమునకు సంబంధించిన ఇతర పదములై యున్నవి. దేవుడు పరిశుద్ధుడై యున్నాడు, గనుక ఆయన పిల్లలు సహితము పరిశుద్ధులై యుండవలెను (1 పేతురు 1:15, 16).

**వచనము 10.** దేవునిని సంబోధించి ఆయనను ఆరాధించిన తదుపరి, యేసు దేవుని రాజ్యము వైపు తన దృష్టిని మళ్లించి, "నీ రాజ్యము వచ్చుగాక" అని పలికాడు. యేసు తన శిష్యులకు ఈ ప్రార్థనను నేర్పించిన సమయంలో, దేవుని రాజ్యము యింకా భవిష్యత్‌లో రావలసినదై యుండినది (3:2; 4:17; 10:7; మార్కు 9:1; అపొస్తలుల కార్యములు 1:6–8). ఈ ప్రార్థన, ముమ్మందు పెంతెకొస్తు దినాన సంభవింపనై యుండిన సంఘటనలను దృష్టిలో నుంచుకొని చేయబడినదై యున్నది, ఈ వివరము అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలో వ్రాయబడి యున్నది. ఆ దినాన, పేతురు మొట్టమొదటిసారి సువార్తను దాని సంపూర్ణతతో బోధించాడు. దావీదు సింహాసనముపై ఆయన కూర్చుండినట్లు దేవుడు మృతులలో నుండి లేపాడనియు, ఇప్పుడు ఆయన దేవుని రాజ్యమును పరిపాలించుచు, పరలోకమందున్నాడనియు పేతురు చెప్పాడు (అపొస్తలుల కార్యములు 2:24–36). యేసు "ప్రభువుగాను క్రీస్తుగాను" చేయబడియున్నాడు (అపొస్తలుల కార్యములు 2:36), "క్రీస్తు" అనగా మెస్సీయ లేదా "దేవుని చేత అభిషిక్తుడైనవాడని" అర్థము. దేవుని రాజ్యము వచ్చియున్నది (కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28; ప్రకటన 1:9). ఇప్పుడు యేసు ఈ కార్యమును ఏలుచున్నాడు, గనుక ఆయన దానిని మరల తండ్రియైన దేవునికి ఒప్పుజెప్పునంత వరకు దానిని ఏలుచుండును (1 కొరింథీయులకు 15:24–26).

దేవుని రాజ్యముతో అతి సమీపమైన సంబంధములో, యేసు, **నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక** అని నేర్పించాడు. పరలోకమందు, దేవుని చిత్తమునకు దేవదూతల సమూహము యొక్క సంపూర్ణమైన అనువర్తనమున్నది. ఇదే విధమైన (దేవుని) ఆధీనంలోనికి తెచ్చుకొను స్థితి భూమియందున్న ప్రజల హృదయాంతరంగములోనికి చొచ్చుకొనిపోవునట్లు ప్రార్థించవలెనని యేసు అనుచరులు ఆదేశింపబడ్డారు. ఇటువంటి ప్రార్థన చేయుటకు మొదట శిష్యులు వారి జీవితములను సంపూర్తిగా దేవుని చిత్తమునకు వశము చేసికొన్నవారై యుండవలెను. వినమ్రమైన ఈ వైఖరిని ప్రదర్శించగలుగుటకు ఒకడు గొప్ప త్యాగము చేయవలసి యుండును. యేసు ఇదే విధమైన మాటలను గెత్సేమనే తోటలో ఉచ్చరించిన పిదప అంతిమ మూల్యమును ఆయన చెల్లించాడు: "అయినను నా యిష్టముకాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక" (లూకా 22:42).

**వచనము 11.** ఆధ్యాత్మిక అంశాల నుండి భౌతిక సంబంధమైన అవసరములకు యేసు ఒక శీఘ్రమైన మార్పు చేసాడు. **మా అనుదిన ఆహారము నేడు మాకు దయచేయుమని** ఆయన చెప్పాడు. "అనుదిన" అని అనువదింపబడిన గ్రీకు పదము (*epiousios*) లేఖనములలో (లూకా 11:3లో వ్రాయబడియున్న సమానాంతర వివరణములో తప్ప) మరెక్కడను కనిపించదు. ఈ పదము "చాలినంత," "అనుదినము," లేదా "రేపటికి" అను అర్థముల నియ్యవచ్చును. కచ్చితముగా సరిపడు అనువాదముతో నిమిత్తము లేకుండా, ఇది ఒకని కనీస అవసరములను దేవుడు తీర్చునట్లు చేయబడు ప్రార్థనయై యున్నది. "నేడు" అను పదమునకు బదులుగా లూకా 11:3లో "దిన దినము" అని వ్రాయబడియున్నది.

అత్యధికమైన వర్ధమాన దేశాలలో, కేవలము ఒకనాటి పొట్ట కూటి కోసం సరిపడు వేతనం కొరకు ప్రజలు యింకా ఆనాడంతా పనులు చేయుచున్నారు. అతి తరచుగా, సౌభాగ్య సమృద్ధి, కృతజ్ఞత లేమి మరియు దేవుని మీద అనుదినము ఆధారపడకుండుటకు దారితీయుచున్నట్లు కనిపించుచున్నది (ద్వితీయోపదేశకాండము 6:10–12; 8:11–18). దేవుడు ఇశ్రాయేలీయులకు పరలోకము నుండి మన్నాను సమకూర్చినప్పుడు, సబ్బాతు కొరకు ఆయన చేసిన సిద్ధపాటులను మినహాయిస్తే తప్ప, ఆయన ప్రతి ఒక్కరికి ఆనాటికి చాలినంత మేరకే సరఫరా చేసాడు (నిర్గమకాండము 16:12–31). ఒకవేళ ఎవరైనాగాని ఆ నాటికి సరిపడు దాని కంటే ఎక్కువగా సమకూర్చుకొన్నట్లయితే. మరుసటి ఆ రోజుకల్లా ఆ మన్నా పురుగుపట్టి కంపుకొట్టినది. రేపటి గూర్చి చింతించుటలో గల తెలివితక్కువతనమును యాకోబు మనకు బోధించాడు, ఏలయనగా 'రేపు' అను దినము ఎన్నడునూ రాదు (యాకోబు 4:13–15; మత్తయి 6:34 చూడు).

**వచనము 12.** యేసు ఉపదేశము ప్రకారము, ప్రార్థన చేయాల్సిన మరొక ప్రాముఖ్యమైన విషయము క్షమాపణయై యున్నది. **ఋణములు** (*opheilēma*) అను మాట "పాపము"నకు సంబంధించిన ఐదు గ్రీకు పదములలో ఒకటై యున్నది (లూకా 11:4 చూడు), గనుక అది క్రొత్త నిబంధనలో కొన్ని పర్యాయములు మాత్రమే ప్రయోగింపబడినది. ఏదిఏమైనా, దాని క్రియా రూపము ముప్పైసార్ల కంటె ఎక్కువగా ఉపయోగింపబడినది. అరమెయిక్ భాషలో, యేసు కాలములో పాలస్తీనాలో సామాన్య వాడుక భాషయై యుండిన భాషలో, పాపమును ఒక "ఋణము"గా (*hobá*) ప్రస్తావించు, అదొక అలవాటై యుండినది.[25] దేవుని కృపా సింహాసనమును సమీపించినప్పుడు ప్రయోగించుటకు ఇది సందర్భోచితమైన పదమై యున్నది, ఏలయనగా మనమందరమును **ఋణస్థులమై** యున్నాము. అతనికి అచ్చియుండినవానిని క్షమించని దాసుని గూర్చి యేసు చెప్పిన ఉపమానము (18:23–35) మనకు ఈ సత్యమును గుర్తుచేయుటకు ఉపదేశింపబడినది. క్షమించుటకు విఫలులగువారు దేవుని చేత క్షమింపబడరనునది ఈ ఉపమానము నుండి మనము నేర్చుకొనగల మరొక పాఠమై యున్నది. యేసు దీనిని మాదిరి ప్రార్థనలో సుస్పష్టంచేసి అటుతరువాత ఈ విషయాన్ని 6:14, 15లో యింకా విశదంగా వివరించాడు. తండ్రియైన దేవుని నుండి మనము పొందగల క్షమాపణ, మన యెడల అపరాధము చేసినవారిని, అందుకు వారు అర్హులైనా కాకపోయినా, వారిని **క్షమించుటకు** మనము ఇష్టపడుటపై ఆధారపడియున్నది. యేసు ఇతరులను – ఆయనను సిలువవేసిన వారిని సహితము – క్షమించిన రీతిలో మనము వారిని క్షమించవలెను (లూకా 23:34).

**వచనము 13. మమ్మును శోధనలోనికి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుమని** చెప్పుటతో యేసు తన విన్నపములను ముగించాడు. "శోధన" (*peirasmos*) యను సమానార్థమిచ్చు గ్రీకు భాషా పదము దేవుడు పెట్టు ఒక "పరీక్షను" లేదా అపవాది కలిగించు ఒక "శోధన"ను సూచింపవచ్చును (4:1పై గల వ్యాఖ్యానమును చూడు). మనము శోధింపబడుటకును దేవుడు అనుమతించును, కానీ "ఆయన తానే ఎవనిని శోధింపడు" (యాకోబు 1:13). మనము శోధింపబడునట్లు దేవుడు అనుమతించినప్పుడు, సాతాను మనకు చేయగల దానికి ఆయన మేరలను నియమించును (యోబు 1; 2), మరియు ఆయన "శోధనతో కూడ తప్పించుకొను మార్గమును" సమకూర్చును (1 కొరింథీయులకు 10:13).

"మమ్మును శోధనలోకి తేకుము" అను మాటలకు గల కచ్చితమైన అర్థము తరుచుగా ఒక చర్చనీయాంశమైనది. "దేవుడు ఎవరినైనా శోధనలోకి నడిపించునా?" యని మనము ప్రశ్నించుదుము. ఏదిఏమైనా, యేసు "అపవాది చేత శోధింపబడుటకు **ఆత్మ** వలన అరణ్యమునకు కొనిపోబడెనని" వ్రాయబడియున్న విషయమును మనము గమనించవలెను (4:1). ఆధ్యాత్మిక ప్రపంచంలో జరుగుచుండు దానిలో అధిక శాతం మనకొక మర్మముగానే మిగిలియుండును (ఎఫెసీయులకు 6:12), గనుక "భక్తులను శోధనలోనుండి తప్పించుటకు ... ప్రభువు సమర్థుడని" మనము నిశ్చయపడగలము (2 పేతురు 2:9). కాబట్టి వారు "శోధనలోకి ప్రవేశించకుండునట్లు" అనుగ్రహింపుమనియు (26:41), "దుష్టత్వము" లేక "దుష్టుని" నుండి (NIV) దేవుడు విడుదలను కలిగించవలెననియు యేసు శిష్యులు ప్రార్థించవలెను.

అటుతరువాత కాలము నాటి గ్రీకు చేతివ్రాత ప్రతులు ఈ స్తుతిగీతమును చేర్చియున్నవి, దీనిని NASB కుండలీకరణము గావించినది: [**ఎందుకనగా రాజ్యము, బలము, మహిమయు నీవై యున్నవి, ఆమెన్.**] *Didache*లో, రెండవ శతాబ్దము నాటి క్రైస్తవ రచనలో, చిన్న ముగింపు కలదు: "ఎందుకనగా రాజ్యము, బలము, మరియు మహిమయు నీవై యున్నవి."[26] స్తుతి గీతము యొక్క చర్చనీయాంశములు ("రాజ్యము," "బలము," మరియు "మహిమ") ఈ ప్రార్థన ప్రారంభములో నున్న విషయములను ప్రతిబింబించుచున్నవి (6:9, 10).

### షరతుతో కూడిన క్షమాపణ (6:14, 15)

**[14]మనుష్యుల అపరాధములను మీరు క్షమించినయెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. [15]మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల, మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు.**

**వచనము 14, 15. క్షమించుట** యని సమానార్థమిచ్చు గ్రీకు పదము (*aphiēmi*) "విసరివేసిన," "రద్దుచేయుము," లేక "మన్నించుము" అని అర్థమిచ్చును. మనము పాపము చేసి, క్షమాపణ కొరకు దేవుని అడిగినప్పుడు, ఆయన మన పాపములను మనలో నుండి తొలగించి వాటిని పారవేయును. ఆయన ఒక వైపు మన పాపమును మరచిపోకపోగా, దానిని యిక మీదట మనకు వ్యతిరేకముగా నిలిపియుంచుకొనక, మరొక వైపు మనము అట్టి పాపమును ఎన్నడును చేయలేదన్నట్లుగా ఆయన మన యెడల ప్రతిస్పందించును.[27]

**అతిక్రమము,** *paraptōma* అను పదము యొక్క బహువచన రూపము నుండి అనువదింపబడినది, ఇది "అపరాధములు" అని కూడ అనువదింపబడవచ్చును. ఈ పదము సువార్తలలో ఇచ్చట మరియు మార్కు 11:25, 26లో మాత్రమే వాడబడినది. దీనికి "తప్పటడుగు," "తొట్రిల్లుట," లేక "పడిపోవుట" అను అభిప్రాయము కలదు. 12వ వచనములోని "ఋణములు" (*opheilēma*) అను పదము వలె, ఇది "పాపము"నకు మరొక పదమై యున్నది.

దేవుడు మనకనుగ్రహించు క్షమాపణ, మనకు విరోధముగా తప్పిదములు చేసినవారిని మనము **క్షమించుటకు** ఇష్టపడుటపై ఆధారపడియున్నది. మనము క్షమించనట్లయితే దేవుడు కూడ **మనలను క్షమించడు.**

### ఉపవాసముచేయుట (6:16-18)

**16మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై యుండకుడి; తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖములను వికారము చేసికొందురు; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. 17ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని కాక, రహస్యమందున్న నీ తండ్రికే కనబడవలెనని, నీవు ఉపవాసము చేయునప్పుడు నీ తల అంటుకొని నీ ముఖము కడుగుకొనుము. 18అప్పుడు రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును.**

*ఇచ్చుట* (6:2-4) మరియు *ప్రార్థించుట* (6:5-15) గూర్చి చర్చించిన పిదప, ఆయన శిష్యులు అవలంభించవలసిన ఆధ్యాత్మిక క్రమశిక్షణలలో ముఖ్యమైనదై మూడవ విషయమును యేసు ప్రస్తావించాడు, *ఉపవాసము చేయుట* (6:16-18). మరొక పర్యాయము, ప్రజలందరి మెప్పు కొరకు బహిరంగముగా చేయబడు నీతి క్రియల గూర్చి వారు హెచ్చరింపబడుచున్నారు.

**వచనము 16. మీరు ఉపవాసము చేయునప్పుడు** అను పదజాలముతో యేసు ఉపవాసమును గూర్చిన చర్చను మొదలుపెట్టాడు. ధర్మము చేయుట (6:2) మరియు ప్రార్థనలు చేయుట (6:5) వంటి యూదుల అలవాట్ల వలెనే, ఉపవాసము చేయుట ఆయన శిష్యులు కూడ అదివరకే అభ్యసించుచుండిరని యేసు భావించిన కార్యకలాపమై యుండినది.

"ఉపవాసము"నకు *tsum*, పాత నిబంధన హెబ్రీ పదమై యున్నది. ఉపవాసమును గూర్చిన అభిప్రాయము, పాపముల ప్రాయశ్చిత్తార్థ దినమునకు సంబంధించి వివరించబడిన విషయము, ఆత్మను తగ్గించుకొనుట ("బాధించుకొను"; KJV) గూర్చినదై యున్నది (లేవీయకాండము 16:29-31). వాస్తవమునకు ఇది ధర్మశాస్త్రములో ఆజ్ఞాపింపబడిన ఒకే ఉపవాసమై యుండినది, కానీ శతాబ్దములు గడిచిన కొలది ఉపవాసమునకు సంబంధించినంత ఇతర దినములు అమలులోనికి వచ్చినవి. "పాపముల ప్రాయశ్చిత్తార్థ దినమున (1) తినుట, (2) త్రాగుట, (3) స్నానము చేయుట, (4) ఎటువంటి నూనెనైనను రాసుకొనుట, (5) చెప్పులు తొడుగుకొనుట, (6) లేదా లైంగిక సంబంధములలో

నిమగ్నమగుట నిషేధింపబడినదని" యూదుల సాంప్రదాయము ప్రకటించినది.[28]

పాత నిబంధన ఉపవాసములు అడపాదడపా చేయబడినవి మరియు అవి అసాధారణమైనవైయుండినవి, అయితే ఇతర ఉపవాసములు క్రమము తప్పక చేయబడినవి. అనారోగ్యము, అంగలార్పు, ఆపద, పాపము గూర్చి దుఃఖపడుట, మరియు ఇతర క్లిష్ట పరిస్థితులలో ఉపవాసము ఆచరింపబడినది (కీర్తనలు 35:13 చూడు). అతని కుమారుడు రోగియై చావనైయుండినప్పుడు దావీదు ఉపవాసము చేసాడు (2 సమూయేలు 12:16-23). సౌలు కుమారుల నిమిత్తము ఆయన, యాబేషే ప్రజలందరితో కూడ, ఏడు దినములు ఉపవాసము చేయుచు అంగలార్చాడు (1 సమూయేలు 31:12, 13; 2 సమూయేలు 1:11-16). దేవుని నుండి ప్రత్యక్షతలు పొందక మునుపు మోషే మరియు దానియేలు ఉపవాసమున్నారు (నిర్గమకాండము 34:28; దానియేలు 9:3). ఆయన యెజెబెలు రాణి ఆగ్రహమునకు గురికాకుండునట్లు పారిపోవుచుండిన సందర్భములో ఏలీయా ఉపవాసమున్నాడు (1 రాజులు 19:8). ఆయన చేసిన పాపములకు శిక్షగా దేవుడు ఆయన మీదికి శాపమును రప్పించనైయున్నాడని అతనికి సమాచారము అందించబడినప్పుడు మూర్ఖుడైన అహాబు సహితము ఉపవాసమున్నాడు. ఆయన ప్రదర్శించిన విరిగినలిగిన హృదయమును దేవుడు గౌరవించి, శాపమును రానీయలేదు (1 రాజులు 21:27). సమూహములుగాను జాతీయ స్థాయిలోను ఉపవాసముండిన సందర్భములు పాత నిబంధనలో కలవు (యెహోషువ 7:6; న్యాయాధిపతులు 20:24-28; 2 దినవృత్తాంతములు 20:3; ఎజ్రా 8:21-23; నెహెమ్యా 9:1; యోనా 3:5). యూదులు బబులోను దేశమునకు చెరగా కొనిపోబడినప్పుడు, వారి పాపములుగూర్చి వారు పశ్చాత్తాపపడుచున్నారని చూపించుటకు వారు ఉపవాస కాలములను ఏర్పాటుచేసికొన్నారు. నాలుగవ, ఐదవ, ఏడవ, మరియు పదవ మాసములలో ఉపవాసములు ఆచరింపబడినవని జెకర్యా పేర్కొన్నాడు (జెకర్యా 7:1-7; 8:19).

"ఉపవాసము" అని అనువదింపబడిన గ్రీకు క్రియా పదము (*nēsteuō*) మరియు సంబంధిత నామవాచక పదములు క్రొత్త నిబంధనలో సుమారు ముప్పై పర్యాయములు కనిపించును. ఈ పదములు ఆహార పానీయాదులకు దూరముగా నుండుటకు సూచించును. ఉపవాసము అతి తరచుగా ఆధ్యాత్మిక ఉద్దేశములకు సంబంధించినదై యుండును. సరైన రీతిలో ఉపవాసమున్నప్పుడు, అది ఆ వ్యక్తిని దేవునికి మరి ఎక్కువ సన్నిహితుని జేయును. అదే విధముగా, ఉపవాసము తరుచుగా ప్రార్థనతో ముడిపడి యుండును (లూకా 2:37; 5:33; అపొస్తలుల కార్యములు 13:3; 14:23). ఉపవాసముండుట ఒక ప్రదర్శన కొరకు కాదు; ప్రగాఢముగా విరిగినలిగినదియు సత్యనిష్ఠగలదియునైన వైఖరి మరియు హృదయ చిత్తవృత్తికి అదొక నిదర్శనమై యున్నది.

యేసు, ధర్మశాస్త్ర నియమము ప్రకారము జీవించినవాడు మరియు మరణించినవాడు, అపవాది చేత శోధింపబడుటకు వానిని కలిసికొనక మునుపు నలుబది దివారాత్రములు ఉపవాసమున్నాడు (4:2). వారు ఉపవాసము చేయవలెనని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించలేదు, ఏదిఏమైనా, ఆయన అనుచరులు ఉపవాసముందురను ధ్వనింపును వ్యక్తము చేసాడు.

ఆది సంఘము క్రమము తప్పక ఉపవాసముండినదని చూపించుటకు క్రొత్త నిబంధనలో

మనకు ఉదాహరణమైనను లేదు. పౌలు మరియు బర్నబాను వారి తొలి మిషనెరీ ప్రయాణముపై పంపుట (అపొస్తలుల కార్యములు 13:2), మరియు సభ్యులకు ఉపచారము చేయుటకు అవసరమై యుండిన సంఘ పెద్దలను ఎంపిక చేయుట (అపొస్తలుల కార్యములు 14:23) వంటి ముఖ్యమైన తీర్మానములకు ముందు క్రైస్తవులు ఉపవాసమున్నారు.

యేసు క్రీస్తు ఏతెంచిన రోజుల్లో, పరిసయ్యులు వారమునకు రెండు రోజులు ఉపవాసమున్నారు (లూకా 18:12), సర్వసాధారణంగా సోమవారము మరియు గురువారము నాడు, ఏలయనగా అవి సంత జరుగుచుండు రోజులై యుండినవి.[29] వారు ఎంతో భక్తిపరులను భావముతో ప్రజల మనస్సులను ప్రభావితము చేయుటకు ఇది వారికొక మంచి అవకాశమును కల్పించినది. యేసు చెప్పుచుండిన వారు, ఉపవాసము చేయుచున్నారని, ప్రజలందరు గుర్తించునట్లు **విషాదభరితమైన ముఖములు ధరించుచు వారి రూపురేఖలను నిర్లక్ష్యము చేయుచుండిరి**. దువ్వకొనని తలవెంట్రుకలతో, ముడతలు పడిన వస్త్రములు ధరించి, పాలిపోయి యున్నట్లగుపించుటకు ముఖము మీద తెల్లని పౌడర్ పూసుకొని వారు బహిరంగముగా కాలినడకన వెళ్లుచుండిరి. మరొక పర్యాయము, ఇటువంటి **వేషధారులు** – దేవుని యెదుట వినయమనస్కులై యున్నట్లు నటించుచుండినవారు – **వారి ప్రతిఫలము పొందియున్నారని** యేసు సెలవిచ్చాడు.

**వచనములు 17, 18.** దీనికి తారతమ్యముగా, వారు ఉపవాసము చేయుచున్నారని ఇతరులు తెలిసికొనకుండు రీతిలో వారు ఉపవాసము చేయవలెనని యేసు తన శిష్యులకు తెలియజెప్పాడు. యూదా సాంప్రదాయమునకు వ్యతిరేకముగా వెళ్లుచు, వారు ఉపవాసము చేయునప్పుడు **నీ తల అంటుకొని, నీ ముఖము కడుగుకొనుము** అని యేసు తన శిష్యులకు చెప్పాడు.[30] అవన్నియు నిజమైన ఉపవాసమునకు నిదర్శనములైయున్న అంశములని ఆయన సమకాలికులు పరిగణించుచుండినవియు, వాడుకలో నుండినవియునైన విషయములకు విరుద్ధముగా ప్రవర్తించుట ద్వారా, ఒకడు తన నీతిని రహస్యముగా ఉంచుకొనుట గూర్చి యేసు అత్యధికంగా ఆందోళన చెందుచుండెననునది స్పష్టమగుచున్నది.[31] సరియైనదని సమ్మతించినను, ఒకడు చేయుచున్న ఉపవాసమును పూర్తిగా రహస్యముగా నుంచుకొనుట, అప్పుడప్పుడు అది కష్టముగా నుండును (6:4, 6పై గల వ్యాఖ్యానమును చూడు), కానీ యేసు శిష్యులు మాత్రం ఎలాగైనా సరే వారి ఉపవాసమును రహస్యముగానే ఉంచవలసినవారై యుండిరి. యేసు అనుచరులు, వారి నీతి క్రియలు ప్రజలందరికీ తెలియునట్లు ప్రచురము చేయవలసిన పని లేదనునది అసలు విషయమై యున్నది. వారు అణకువతో ఉపవాసమున్నప్పుడు, దేవుడు వారికి ప్రతిఫలమిచ్చును.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### హృదయపూర్వకముగా ఇచ్చుట (6:2–4)

యేసు మత్తయి 6:1–18లో, నీతి క్రియలు చేయబడుచుండుట, ఇచ్చుట, ప్రార్థన చేయుట, మరియు ఉపవాసముండుట గూర్చి చర్చించారు. వీటిలోని మొదటి విభాగములో నుండి (6:2–4), మనము ఇచ్చుట గూర్చి మూడు పాఠములు నేర్చుకొనగలము.

*మొదటిగా, మనము దేవుని యెడల కలిగియున్న ప్రేమను బట్టి ఇవ్వవలనేగాని, మన చుట్టూరా నున్నవారు చూచుటకు కాదు.* తమ్మును గూర్చి ఇతరులు గొప్పగా చెప్పుకొనవలెనను

ఉద్దేశముతో ఇచ్చుటకు వ్యతిరేకముగా యేసు తన శిష్యులను హెచ్చరించాడు. ఈ సూత్రమును అననీయ, సప్పీర కథ చక్కగా చిత్రీకరించుచున్నది. ఈ దంపతులు కొంత సొత్తును అమ్మారు, వచ్చిన మొత్తములో కొంత భాగమును మాత్రమే అననీయ అపొస్తలుల పాదముల యొద్ద పెట్టాడు. వచ్చిన మొత్తమంతటిని ఇచ్చివేయుచుండినట్లు నటించుచు, ఆయన కొంత సొమ్మును తన కొరకే ఉంచుకొన్నారు. అననీయ ఈ పనంతా తన భార్య సప్పీర ఎరుకతోనే చేసాడు. వారిరువురు కలిసి చేసిన వంచన యొక్క ఫలితము, మరణము; దేవుడు వారు వేషధారణను ఒక ఉదాహరణంగా చేసాడు (అపొస్తలుల కార్యములు 5:1–11). ఇతరులు చూడవలెనని ఇచ్చుచుండువారు "వారి ప్రతిఫలము పొందియున్నారని" – అనగా, వారు ప్రతిఫలముగా పొందునని మనుష్యుల పొగడ్తలు మాత్రమే అని – యేసు సెలవిచ్చాడు. దానికి బదులుగా, క్రైస్తవుడు ఇచ్చునప్పుడు, అది దేవుని యెడల వాడు కలిగియున్న ప్రేమనుబట్టి వాని హృదయాంతరంగములో నుండి రావలెను. "ఆయనే మొదట మనలను ప్రేమించెను, గనుక మనము ప్రేమించుచున్నామని" – యోహాను వ్రాయుచున్నాడు (1 యోహాను 4:19). మనము దేవుని గౌరవించవలెనను ఉద్దేశముతో యిచ్చినప్పుడు, ఆయన తుదకు తన ప్రతిఫలమును మనకిచ్చును.

*రెండవదిగా, మనము విచక్షణాసహితముగా ఇయ్యవలెను.* ఇచ్చుటకు సంబంధించినంత వరకు, "నీ కుడిచెయ్యి చేయునది నీ యెడమ చేతికి తెలియక యుండవలెనని" యేసు చెప్పాడు. ఒకరు ఇచ్చునప్పుడు సాధ్యమైనంత విచక్షణాసహితంగా ఇవ్వవలెననునది, అటువంటి సందర్భాలలో నలుగురు చెప్పుకోదగినట్లు అదొక రూపంలో చెప్పుకొనబడుచుండిన విధానమై యుండవచ్చును. మనము ఇచ్చునప్పుడు, ఇతరుల ముందు ఉదారతను బహిరంగముగా ప్రదర్శింపవలసిన పని లేదు.

*మూడవదిగా, మనము ఇతరులకు సహాయము చేయుటకు యథార్థముగా ఇవ్వవలెను.* సందర్భానుసారంగా, బీదలకు దానధర్మములు చేయునప్పుడు యూదులకుండిన అలవాటుతో యేసు వ్యవహరించుచుండెను. బీదల యెడల, వారి అనేక అవసరముల గూర్చి తగు శ్రద్ధ వహించుచు కనికరము చూపుటలో యేసు తానే ఒక మాదిరిని ప్రదర్శించాడు. ఈ సమస్యలలో కొన్ని శారీరక సంబంధమైనవై యుండనవి (ఆకలి, అనారోగ్యము, వ్యాధులు, మరియు మరణము), ఇతరమైనవి ఆధ్యాత్మిక అవసరములై యుండినవి (అజ్ఞానము, దయ్యముల చేత పీడింపబడుట, మరియు ఆధ్యాత్మిక మరణము). మనము ఇచ్చునది ఇతరులనుభవించు శ్రమల తీవ్రతను తగ్గించు గురి గలదై యుండవలెను. "తండ్రియైన దేవునియెదుట నిష్కలంకమైన భక్తి యేదనగా: దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి ఇబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తనకంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" అని యాకోబు రచించాడు (యాకోబు 1:27). "పరామర్శించుట" అనగా ఆయన అర్థమేమిటో ఆయన సూచించాడు: "సహోదరుడైనను సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నప్పుడు, మీలో ఎవడైనను శరీరమునకు కావలసినవాటిని ఇయ్యక, సమాధానముగా వెళ్లుడి, చలికాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము?" (యాకోబు 2:15, 16). అవసరములో నున్న వారి యెడల సహానుభూతులు కలిగియున్నంత మాత్రాన, అది వారికి ఎవ్విధంగాను సహాయపడదు; వారి బాధకు ఉపశమనము కలిగించునట్లు మనము ఏదైనా ఒక పని చేయవలెను.

మనస్సు గాయపడియున్నవారి యెడల యథార్థమైన కనికరము కలిగియుండుట వలన మనము వారి అవసరములను తీర్చునట్లు మనకు ప్రేరణ కలుగునని యేసు ఉపదేశములు ధ్వనించుచున్నవి.

మనమిచ్చు సహాయసహకారము దేవుని దృష్టికి విలువైనదై యుండుటకు అది మనుష్యుల దృష్టిలో గొప్పదై యుండనవసరము లేదు. కానుక పెట్టెలో విధవరాలు వేసిన "రెండు కాసులు" యేసు దృష్టిని ఆకర్షించినవి (మార్కు 12:41-44). యథార్థమైన ఉదారతలో మామూలు వస్త్రములు, ప్రేమతో కూడిన భోజనము, లేదా గిన్నెడు చన్నీళ్లు ఉండవచ్చును (10:42; 25:34-40).

## ప్రార్థన (6:5-8)

మనకు అవసరమై యున్నవేమిటో మనము అడుగక మునుపే తండ్రికి తెలియును గనుక, మనమెందుకు అడుగవలెను? మన అవసరములు దేవునికి తెలియును, కానీ విశేషణమైన విషయమేమనగా మనము ఆయనతో ముచ్చటించవలెనని ఆయన కోరుచున్నాడు (7:7; ఫిలిప్పీయులకు 4:6). మనము ఆయనను పదే పదే అడుగవలెనని ఆయన కొన్ని పర్యాయములు ఆశించుచుండును. ఈ సత్యమును సవివరంగా చిత్రీకరించుటకు యేసు రెండు ఉపమానములు చెప్పాడు, ఒకటి మధ్యరాత్రి స్నేహితుని గూర్చినది (లూకా 11:5-10), మరొకటి పట్టువదలక పలుమార్లు బ్రతిమలాడిన విధవరాలు గూర్చినది (లూకా 18:1-8). యేసు గెత్సేమనే తోటలో ఒకే విషయమై ముమ్మారు ప్రార్థించిన విధంగానే (26:36-46). "తన శరీరములోని ముల్లు" తొలగిపోవలెనని పౌలు ముమ్మారు ప్రార్థించాడు (2 కొరింథీయులకు 12:7-10). మనము ప్రార్థనలు చేయుట మొత్తానికే మానివేయుటకు గల ఉన్ముఖత గూర్చి దేవుడు ఆందోళన చెందుచున్నంతగా, మనము చేయు ప్రార్థనలు సుదీర్ఘమైనవా లేక సంక్షిప్తమైనవా అను దాని గూర్చి ఆయన ఆందోళన చెందుట లేదు. ఆయన మనము అడుగుచుండు విషయములను మనమడుగుచున్నట్లుగా, మనమడుగుచున్న సమయములోనే తీర్చవలెనని మనము దేవుని వేధించలేము, కానీ మనము చేయు ఏదైన ఒక నిర్దిష్టమైన ప్రార్థనకు ఆయన యిచ్చు జవాబు ఎంత తెగింపుగా అవసరమై యున్నదో మనము అర్థంచేసికొనవలెనని కొన్ని పర్యాయములు ఆయన కోరవచ్చును.

సరైన విధముగా ప్రార్థన చేయుటకు చిత్తశుద్ధి గల హృదయము మరియు యథార్థమైన ప్రోత్సాహకములు అవసరమై యున్నవి. దేవుడు ప్రతిప్రార్థనను ఆలకించుననియు, ఆయన పిల్లల శ్రేయస్సుకు ఉత్తమమైనదై యుండునట్లుగా ప్రతి ప్రార్థనకు ఆయన జవాబిచ్చుననియు గల నమ్మకముతో ప్రార్థన చేయుట కూడా దానిలో కలిసియున్నది (1 యోహాను 5:14, 15). మనము ఎల్లప్పుడు "దేవుని చిత్త ప్రకారము" ప్రార్థనలు చేయవలెను. మనము ఆయన చిత్తమును నెరవేర్చుచున్నవారమైతేనే తప్ప, మనము "నీ చిత్తము నెరవేరునుగాక" అని చిత్తశుద్ధితో ప్రార్థన చేయలేము. మనము దేవుని చిత్త ప్రకారము ప్రార్థన చేయునట్లు, ఆయన చిత్తమేమిటో తెలిసికొనుటకు మనము ఆయన వాక్యమును అధ్యయనము చేయవలెను. "నీ చిత్తము నెరవేరునుగాక" అని మనము చిత్తశుద్ధితో ప్రార్థన చేసినప్పుడు, మన ప్రార్థనలకు ఆయన ఎల్లప్పుడు జవాబిచ్చును. "సరే" అని గాని, "లేదు" అని గాని, లేదా "కొంత కాలము వేచియుండుము" అని గాని ఆయన జవాబియ్యవచ్చును, కానీ మొత్తానికి ఆయన

తన ప్రజలు చేయు సమస్త ప్రార్థనలకు ఎల్లప్పుడు సమాధానమిచ్చును.

### మాదిరి ప్రార్థన (6:9-13)

ప్రార్థన చేయు విధానమును యేసు తన శిష్యులకు నేర్పించినప్పుడు, నేడు మనము చేయుచుండు ప్రార్థనలలో భాగమై యుండవలసిన ఐదు అంశములను ఆయన జోడించాడు.

*మొదటిది, మనము తండ్రికి స్తుతి చెల్లించవలెను* (6:9). మన సృష్టికర్తగా, మనలను ఆదుకొనువాడుగా, మరియు మన విమోచకుడుగా ఆయన మనము బహుగా స్తుతింపదగిన దేవుడై యున్నాడు. ఆయన సహజాతీతమైన గుణలక్షణములనుబట్టి, ఆయన ప్రేమ, పరిశుద్ధత కనికరము, మరియు కృపనుబట్టి, మనము ఆయనను స్తుతింపవలెను (ప్రకటన 4:8-11).

*రెండవదిగా, మనము ఆయన రాజ్యమునకు ప్రథమ స్థానము నీయవలెను* (6:10). యేసు అదివరకే తన రాజ్యమును, సంఘమును వ్యవస్థాపించి యున్నాడు (16:18, 19; అపొస్తలుల కార్యములు 2). ఏది ఏమైనా, మనము ఆయన రాజ్య విస్తరణ మన మిషనరీలు, మరియు దేవుని వాక్యమును ప్రబలముగా ప్రబలింపజేయుటకు విశ్వసనీయముగా ప్రయాసపడుచున్న ప్రతి ప్రబోధకుడు మరియు ఉపదేశకుని కొరకు యింకను ప్రార్థింపవలసి యున్నది.

*మూడవదిగా, మన ఆహార సమకూర్పు కొరకు అడుగవలెను* (6:11). మనకు అవసరమైయున్నవేవో దేవునికి అది వరకే తెలియును (6:32), కానీ మనము మన జీవితము యొక్క కనీస అవసరతల కొరకు – ఆహారము, వస్త్రములు, మరియు తల దాచుకొనుటకు ఇల్లువాకిలి కొరకు – ప్రార్థనలో ఆయనను సమీపించవలెను. ఆయన మనకు గతములో చేసిన ఉపకారములన్నింటికి మనము ఆయనకు కృతజ్ఞత వందనములు చెల్లించుచు భవిష్యత్‌లో కూడ ఆయన మనలను ఆదుకొనవలెనని ఆయనను అడుగవలెను.

*నాలుగవది, మన పాపముల క్షమాపణ కొరకు వేడుకొనవలెను* (6:12). క్రీస్తు నందు విశ్వసించు వారు గత పాపముల నుండి రక్షింపబడినప్పటికిని మనము దేవుని ఆశించిన స్థాయిలకు తక్కువగా నుండుటకు కొనసాగుచుందుము. మనము యేసు రక్తము చేత ఎడతెరిపి లేకుండా కడుగబడుచుండవలసిన అవసరమున్నది గనుక మనము క్షమాభిక్ష కొరకు ప్రార్థన చేయుచునే యుండవలెను (1 యోహాను 1:7-10). దేవుడు మనలను క్షమించవలెనని మనము ఆశపడుచున్నట్లయితే, మనము ఇతరుల యెడల క్షమాపణా స్ఫూర్తిని ప్రదర్శించవలెను.

*ఐదవది, మనము దుష్టుని నుండి కాపాడబడుచుండలెనని మనవిచేయవలెను* (6:13). మన చుట్టూర చెలరేగుచున్న ఆధ్యాత్మిక పోరాటము నిమిత్తమై మనము నిలకడగా అప్రమత్తులమై యుంటూ (ఎఫెసీయులకు 6:10-20), శోధన నుండి కాపాడబడునట్లును, మనము ఎదుర్కొనుచుండు పరీక్షలలో నెగ్గుటకు అవసరమైయున్న పరిశుద్ధాత్మ బలము కొరకును దేవుని అడుగవలెను.

డేవిడ్ స్టూవర్ట్

## మాదిరి ప్రార్థన పునరావృతము (6:9–13)

మనకివ్వబడిన మాదిరిప్రార్థన పునరుక్తంగా ప్రార్థింపబడుచుండవలెనని ఎన్నడును ఉద్దేశింపబడలేదు. వారు ప్రార్థన యొక్క ప్రాథమిక విషయములను నేర్చుకొనునట్లు దానిని ఒక ఉదాహరణముగా మన ప్రభువు తన శిష్యులకిచ్చాడు (లూకా 11:1–4). ఈ ప్రార్థనను ఎడతెరపిలేకుండా వల్లించుట వలన, "వ్యర్థమైన మాటలు వచించుట" గూర్చి యేసు అది వరకే చెప్పినదానిని అది ఉల్లంఘించును (6:7). వాటి అర్థం సంపూర్తిగా తెలియకపోయినప్పటికి వారు కంఠస్థంచేసిన అనేక ప్రార్థనలు యూదులకుండినవి అయితే అవి వాటి అర్థమునే కోల్పోవునంత తరచుగా మాటల్లో వ్యక్తము చేయబడుచుండినవి. లిఖితపూర్వకముగా నున్న ప్రార్థనల పుస్తకములను వాడుచుండువారు ఇదే పని చేయుచున్నట్లగుపించుచున్నది. వ్రాయబడియున్న ప్రార్థన మాటలను వారు మామూలుగా చదువుకుంటూ వెళ్లుదురు లేదా వాటి అసలు అర్థమేమిటో అంతగా పట్టించుకొనకుండానే అట్టి పదజాలములను వల్లించుచుందురు. సంపూర్తిన్యాయసమ్మతముగా, హృదయాంతరంగములో నుండి చిత్తశుద్ధితో ప్రార్థింపబడని పదజాలమును ఎడతెరిపిలేకుండా మనము వల్లించునప్పుడు మనము కూడ ఇదే పని చేయవచ్చును. యేసు నేర్పిన మాదిరి ప్రార్థనలోని మాటలను ఆది క్రైస్తవులు వల్లించునట్లు క్రొత్త నిబంధనలో – సువార్తలలో, అపొస్తలుల కార్యములలో, లేదా పత్రికలలో – ఎక్కడైనను మనము గమనించము.[32] ఈ మాటలను, లేఖనములలోని ఏదైన ఇతర భాగము వలెనే, కంఠస్థంచేసి మళ్లీ మళ్లీ వల్లించుట, లేదా అవి మనకు ఈ రోజుల్లో తెలియజెప్పు అర్థమును మననము చేయుట నిశ్చయముగా ప్రయోజనకరమైనదై యుండును. ఏది ఏమైనా, పునరావృత్తిగా, ఆచార రీతిగా ఈ ప్రార్థన చేయబడవలెనని యేసు ఎన్నడును ఉద్దేశించలేదు.

## "మా తండ్రి" (6:9)

దేవుని కుటుంబములోనికి "తిరిగి జన్మించినవారు" మాత్రమే ఆయనను ఆధ్యాత్మిక తండ్రిగా కలిగియుందురు (యోహాను 3:3; మత్తయి 23:9). ఒక కోణంలో, అందరూ దేవుని పిల్లలే, ఏలయనగా ఆయన మనలను వంశానుక్రమంగా కన్నాడు; కానీ "తిరిగి జన్మించుట ద్వారా" పుట్టినవారు మాత్రమే ఆయన యొక్క ఆధ్యాత్మిక పిల్లలై యున్నారు. వారు కలిగియున్న విశ్వాసము ఆధారంగా మాత్రమే దేవునితో నుండు "కుమారత్వమను" సాధికారంతో అడుగవలెనని ఈనాడు కొందరు ఆశించుదురు, కానీ అది చాలదు (గలతీయులకు 3:26, 27). తిరిగి జన్మించుటలో సంబంధముగల నీళ్లను వదిలిపెట్టుటకు కొందరు ఆశించుదురు, కానీ "నీటి మూలముగాను మరియు ఆత్మ మూలముగాను" జన్మించకుండా దేవుని కుమారుడు లేక కుమార్తెయై యుండుట అసాధ్యము (యోహాను 3:5). దేవునికి సవతి పిల్లలంటూ ఎవరూ లేరు. ప్రత్యుత్తరమియ్యబడిన ప్రార్థన గూర్చిన వాగ్దానము దేవుని పిల్లలమై యుండుటలో గల ఆశీర్వాదములలో ఒకటై యున్నది (1 పేతురు 3:12; 1 యోహాను 5:14, 15). మనము క్రీస్తునందు విశ్వాసముంచుచున్న వారమైనట్లయితే, దేవుడు మన తండ్రియై యున్నాడు – "పరలోకమందున్న మన తండ్రి." మనము ప్రార్థన చేయునప్పుడు పరలోకమందలి వనరులన్నియును మనకు ఇష్టము వచ్చినప్పుడు, ఇష్టము వచ్చినట్టుగా మనము వాడుకొనుటకు అందుబాటులో నుండును. "...

దేవుడు ... క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెనని" పౌలు రచించాడు (ఎఫెసీయులకు 1:3). ఆయన తన పిల్లను ఆశీర్వదించాలనే దేవుడు ఆశిస్తున్నాడు (7:7–11).

### "నీ రాజ్యము వచ్చునుగాక" (6:10)

దేవుని రాజ్యము రావలెనని చేయబడిన ప్రార్థనలకు ప్రత్యుత్తరము పెంతెకొస్తు దినాన ఇవ్వబడినది (అపొస్తలుల కార్యములు 2). ఆయన రాజ్యము రావలెనని క్రైస్తవులు ఈ నాడు ప్రార్థించుట సముచితమైనది కాకపోయినప్పటికిని, దేవుని చిత్తము "పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరవలెనని" ప్రార్థించుట మనకే మంచిది. దేవుని రాజ్యము ఇప్పుడు ఇచ్చట ఉన్నందునుబట్టి, ఆయనను గౌరవించువారి ద్వారా దేవుని చిత్తము భూమి మీద నెరవేరుచున్నది. మన దేవుడు సార్వభౌముడైన దేవుడై యున్నాడు, కానీ ఆయన మానవాళికి స్వేచ్ఛా చిత్తమునిచ్చాడు. అనగా, మనము ఆయన చిత్తము ప్రకారము చేయుటకుగాని లేదా చేయకుండుటకుగాని ఎంపిక చేసికొనవచ్చునని దీని అర్థము. ఈ సందర్భము ఆధారంగా, నేడు మనము దేని కొరకు ప్రార్థనచేయవలెను? మొదటిది, మన జీవితములలో దేవుని చిత్తము నెరవేరునట్లు మనలో ప్రతి ఒక్కరము ప్రార్థన చేయవలసియున్నది. రెండవదిగా, ఆయన ఏలుబడి పరలోకమందున్నట్లే, భూమి యందును ప్రబలముగా ఆధిపత్యముగలదై యుండవలెనని ప్రార్థించుట సరైనదే. ఉత్తరవాదత్వముగల ప్రతి ఒక్కరి చిత్తము తండ్రి చిత్తమునకు అనుకూలముగా ఉండునట్లు అనుగ్రహింపబడవలెననునది ఎల్లప్పుడు మనము చేయవలసిన ప్రార్థనయై యుండవలెను.

### ఉపవాసము చేయుటకు గల హేతువులు (6:16–18)

క్రైస్తవులు ఉపవాసము చేయవలెనను ఆజ్ఞ ఏదియు లేకపోగా, ఆయన శిష్యులు ఉపవాసము చేయుదురని యేసు పలికిన మాటలలో నిశ్చయముగా ఒక అంతఃస్సూచన ఉన్నది. ఇట్టి అభ్యాసమును మనము అలక్ష్యము చేయుట వలన అనేక, శారీరక మరియు ఆధ్యాత్మిక ప్రయోజనములను కోల్పోవుదుము. ఉపవాసము చేయవలెనుటకు కొన్ని సహేతుకమైన హేతువులియ్యబడినవి:

1. దేవుని దృష్టిలో మనలను మనము తగ్గించుకొనుటకు ... (1 రాజులు 21:27–29; ఎజ్రా 8:21; కీర్తనలు 35:12, 13).
2. మనము ప్రార్థించవలసియున్న నిర్దిష్టమైన విషయముపై మనస్సును కేంద్రకరించుటకు ...
3. మన జీవితములలో ఆధ్యాత్మిక విషయాలకు ప్రథమ స్థానమునిచ్చుటకు ... మనకు ఐహిక ఆకర్షణలకు తక్కువగాను, దేవుడు మరియు ఆధ్యాత్మిక అంశాలకు ఎక్కువగాను ఆకర్షింపబడునట్లు ఉపవాసము చేయుట మనకు సహాయకరముగా ఉండును.
4. మనము శోధనలకు తట్టుకొనగలుగునట్లు మన ఆత్మ నిగ్రహమును మరియు శక్తిసామర్థ్యములను అధికము చేసికొనుటకు ... ఉపవాసము చేయుట వలన ఆత్మ నిగ్రహము మెరుగుపడును, మెరుగుపడిన ఆత్మ నిగ్రహము అధికమైన

ఆధ్యాత్మిక పరిపూర్ణతను కలుగజేయును, ఇట్టి ఆధ్యాత్మిక పరిపూర్ణత దేవునితో మనకుండవలసిన సన్నిహితమును పెంచును.

---

సూచనలు

[1]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 207. Tobit 12:8 "ధర్మము" చేయుట, "ప్రార్థన చేయుట," మరియు "ఉపవాసము చేయుట"ను కలిపి పేర్కొనుచున్నది, కానీ ఒక ప్రత్యేక అంశముగా "నీతి" కూడ చేర్చబడి యున్నది. [2]Michael J. Wilkins, "Matthew," in *Zondervan lllustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 43. [3]Tobit 12:9 (NRSV). [4]Mishna *Shekalim* 2.1; 6.1, 5. [5]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary, (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 98-99. [6]lbid., 99. [7]Sirach 1:29. [8]Wilkins, 44.9. [9]Ceslas Spicq, *Theological Lexicon of the New Testament,* trans. and ed. James D. Ernest (Peabody, Mass.: Hendrikson Publishers, 1994), 1:162-64. [10]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 102.

[11]Mishnah *Shekalim* 5.6. [12]Talmud *Baba Bathra* 9b. [13]Ibid., 10b. [14]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 133. [15]Josephus *Antiquities* 14.4.3. [16]Didache 8.3. [17]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991). [18]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 141, n. 22. [19]"ప్రార్థనను అధికారికంగా హెచ్చించు ప్రతి ఒక్కరు ఆలకింపబడునని" యూదా మత బోధకులలో ఒకరు చెప్పాడు (John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew-1 Corinthians*, vol. 2, *Matthew-Mark* [Oxford: Oxford University Press, 1859; reprint, Grand Rapids, Mich.: Baker, 1979], 145). [20]Keener, 213; citing John E. Stambaugh and David L. Balch, *The New Testament in its Social Environment*, Library of Early Christianity, vol. 2 (Philadelphia: Westminister Press, 1986), 129.

[21]Mounce, 55. [22]Wilkins, 44-45. [23]John R. W. Stott, *The Message of The Sermon on the Mount (Matthew 5-7): Christian Counter Culture*, The Bible Speaks Today (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1978), 144. [24]Wisdom of Solomon 14:3; Sirach 23:1, 4. [25]Craig A. Evans, ed., *The Bible Knowledge Background Commentary: Matthew-Luke*, Bible Knowledge Series, vol. 1 (Colorado Springs, Colo.: Victor, 2003), 232. [26]Didache 8.2. [27]""నేను వారి పాపములను ఇకను ఎన్నడను జ్ఞాపకము చేసికొనను" వాగ్దానము (హెబ్రీయులకు 8:12; 10:17) మనము చేసిన తప్పులకు దేవుడు మనలను శిక్షించడని సామాన్య అర్థము నిచ్చుచున్నది. F. F. Bruce, *The Epistle to the Hebrews*, The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 175 చూడు. [28]Mishnah *Yoma* 8.1. [29]Mishnah *Taanith* 1.4-7; 2.9. రెండవ శతాబ్దమునాటి *Didache* విశ్వాసులను ఈ విధముగా ఆదేశించినది: "మీరు చేయు ఉపవాసములు వేషధారుల ఉపవాసముతో ఏకకాలిక సంభవములై యుండకూడదు. వారు సోమవారము మరియు గురువారము ఉపవాసము చేయుదురు, గనుక మీరు బుధవారము మరియు శుక్రవారము నాడు ఉపవాసము చేయవలెను" (*Didache* 8.1). [30]దావీదు ఉపవాసము చేసిన కాలము ముగిసిన *తరువాతనే* ఆయన "లేచి స్నానము చేసి తైలము పూసికొని వేరు వస్త్రములు ధరించాడు" (2 సమూయేలు 12:20).

[31]Keener, 228. [32]ఏదిఏమైనా, మాదిరి ప్రార్థనను మళ్లీ మళ్లీ చెప్పుచుండు అభ్యాసము, రెండవ శతాబ్దములోనే ఉండినది. బహుశా యూదుల అభ్యాసములను ప్రతిబింబించుచు, వారు మాదిరి ప్రార్థనను ప్రతి రోజు ముమ్మారు చేయవలెనని *Didache* విశ్వాసులకు ఆదేశముల నిచ్చియుండవచ్చును. (*Didache* 8.2, 3.)